# ఒకరికొకరు



కోపూరి పుష్పాదేవి

**నాలుగైదు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు కురిసి, ఆరోజు కొద్దిగా తెరిపిచ్చింది. సూర్యభగవానుణ్ణి చూసి ఎన్నాళ్ళో అయినట్లుగా ఉంది జనానికి. దినకరుడు సిగ్గుపడుతున్న పెళ్ళి కూతురిలా, మబ్బుల చాటు నుంచి తొంగి చూస్తున్నాడు. ఆ కాస్త దానికే ఇల్లాళ్ళు సంబరపడుతున్నారు. ఈ వేళైనా కొద్దిగా బట్టలు ఆరవేసుకోవచ్చని.**

డోర్ బెల్ మోగింది.

"నువ్వా సుభద్రా రారా బాగున్నావా? చాన్నాళ్ళకు వచ్చావు. అసలు కనిపించే రెండేళ్ళయి పోయిందేమో కదా!" అన్నారు మీనాక్షమ్మ తలుపు తీస్తూనే కుశల ప్రశ్నలూ, సందేహాలూ అన్నీ కలగలిపి.

"బాగున్నాను అత్తయ్యా! మీరూ అభిరామ్ బాగున్నారా? అభిరామ్ ఉన్నాడా ఇంట్లో. ఇప్పుడేం చేస్తున్నాడు తను" సుభద్ర కూడా ప్రశ్నల వర్షం కురిపించింది సోఫాలో కూర్చుంటూ.

"ఏం చేస్తాడు.. ఎంత ప్రయత్నించినా, చదువు ఒంటబట్టలేదు వాడికి. ఇక విసుగుపుట్టి మా వ్యాపారమే చూసుకుంటున్నాడు. ఏదో పని ఉన్నదని ఇప్పుడే బజారు వెళ్ళాడు. మీ అమ్మగారు ఏం చేస్తున్నారు? అక్కయ్యలు బాగున్నారా?" ప్రశ్నల పరంపర కొనసాగించారు మీనాక్షమ్మ. "అసలే అందమైన అమ్మాయి. వయసు వచ్చి, మరీ అందంగా తయారయింది. ఏ ఇంటి కోడలవుతుందో గాని అని మనసులో అనుకుంటూ.

"అమ్మ సాయంత్రం వంటకి కూరలు తరుగుతోంది. అక్కయ్యలు బాగానే ఉన్నారు" అన్నది సుభద్ర హాలంతా పరిశీలిస్తూ. అత్తయ్య ఏమీ మారలేదు. అవే పాత కాలంనాటి ఫర్నిచరు. కాకపోతే కొత్తగా టీవీ, ఫ్రిజ్ వచ్చాయి హాలులోకి" అనుకుంటూ.

"ఇప్పుడే వస్తానుండు" అంటూ మీనాక్షమ్మ లోపలకు వెళ్ళారు సుభద్రకు టిఫిన్ తేవడానికి.

❊ ❊ ❊

ఇదివరకు మీనాక్షమ్మగారింటి పక్కన, చిన్న పోర్షనులో సుభద్రా వాళ్ళు అద్దెకు ఉండేవారు. మీనాక్షమ్మగారూ ఆగర్భ శ్రీమంతులు. ఆమెకు ఒక్కడే కొడుకు అభిరామ్. అతని తండ్రి ఈ మధ్యనే చనిపోయారు. అభిరామూ, సుభద్ర అన్న మోహనూ క్లాస్‌మేట్స్. అంతకన్నా ఎక్కువ స్నేహమూ ఉంది వారిద్దరి మధ్య. సుభద్రా వాళ్ళది ఏ పూటకాపూట వెతుక్కోవాలి అన్నటువంటి పరిస్థితి. ఇంకా తక్కువ అద్దెకు ఇల్లు దొరకడంతో దూరంగా వెళ్ళిపోయారు. ఆమెకు ఇద్దరు అక్కలూ, ఒక అన్నయ్య. తండ్రి బట్టల షాపులో గుమాస్తా. కుటుంబానికి, తన రెక్కలు కూడా ఆధారమని భావించిన మోహన్ చదువుకోవాలని ఎంత కోరికగా ఉన్నా, ఇంటర్‌లో ఆపేసి ఏదో ఒక చిన్న ఉద్యోగం వెతుక్కున్నాడు.

ఆ తర్వాతి సంవత్సరం సుభద్ర ఇంటర్‌లో కాలేజీ ఫస్ట్ వచ్చింది. బి.యస్.సి చదువుతానని కూర్చుంది. "మనకంత స్తోమతే ఉంటే అన్నయ్యనే చదివించేవాళ్ళం గదా! చిన్న సన్యాసి ఈ వయసు నుండే రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు" అని సుభద్ర తల్లి ఆమెకు నచ్చ చెప్పాలని శతవిధాలా ప్రయత్నం చేసింది. కానీ, సుభద్ర మొండిపట్టు పట్టింది.

"నీకసలు బుద్ధి ఉందా నిన్నసలు ఇంతవరకూ చదివించడమే ఎక్కువ. మాతోపాటూ టైలరింగ్ చెయ్యి. ఎంతో కొంత సంపాదించి, కొద్దిగా కట్నం మూట కడితే, పెద్దదాని పెళ్ళి చెయ్యొచ్చు." చిన్నక్క రుసరుసలాడింది.

"దాని పెళ్ళి అయితే, నీకు లైన్ క్లియర్ అవుతుందనా? నా బదులు కూడా నువ్వు కష్టపడి, పెద్ద మూట తయారు చెయ్యి. నీకు మంచి మొగుడు వస్తాడు" చిన్నక్కను వెక్కిరించింది సుభద్ర.

"మీ ఇద్దరూ దెబ్బలాడుకోకండే. నాకు అరిచే ఓపిక కూడా లేదు" నీరస పడింది సుభద్ర తల్లి.

మన తాహతుకు డిగ్రీ చదవడమంటే మాటలా.. ఫీజులూ, పుస్తకాలూ, ఇంకా కాలేజీకి

వెళ్ళడమంటే కాస్త మంచి బట్టలూ, ఎన్నెన్ని కావాలి, కాస్త ఆలోచించవే" అన్నది పెద్ద అక్క.

"నాకు తప్పనిసరిగా స్కాలర్‌షిప్ వస్తుంది. పుస్తకాలు కొనవవసరం లేదు. లైబ్రరీవో, ఫ్రెండ్స్‌వో చదువుకుంటాను. ఇంకా బస్ పాస్‌లుంటాయి. అయినా, ఇంకా ఖర్చులుంటాయి. నిజమే. నాకు తెలుసు. అందుకే నేను కూడా ఉదయం, సాయంత్రం పిల్లలకు ట్యూషన్లు చెబుతాను. ఎలాగైనాసరే, నేను మాత్రం చదువుకోవలసిందే" అన్నది సుభద్ర అన్నయ్య పక్కన చేరి బ్రతిమలాడుతూ.

సుభద్ర తండ్రి ఏమీ పట్టించుకోడు. తన నెల జీతం తెచ్చి, భార్య చేతికి ఇస్తాడు. ఆమె పెట్టిందేదో తింటాడు. అతను మేధకుడు. కుటుంబం మంచి చెడులన్నీ సుభద్ర తల్లి చూసుకోవలసిందే. ఇప్పుడా భారం మోహన్ భుజస్కంధాలపై పడింది.

"ఈ ఐదేళ్ళూ ఎలాగోలా కష్టపడితే, నాకూ మంచి ఉద్యోగం వస్తుంది. అక్కయ్యల పెళ్ళిళ్ళు ఈజీగా చెయ్యొచ్చు.. ఏం అన్నయ్యా ఏమంటావు?" సుభద్ర దీనమైన చూపులు.

చిన్నారి చెల్లెలి సమంజసమైన కోరిక కాదనడానికి అతని మనసు ఒప్పడం లేదు. కానీ సుదీర్ఘమైన ఐదు సంవత్సరాలు గడవటమంటే మాటలా? తమకా ఆదాయం మూరెడు. ఖర్చులు బారెడు. సుభద్రకు చిన్నతనం నుండీ చదువంటే ప్రాణం. ఇంక మరే కోరికలూ ఉండవు ఆమెకు. ఆ సంగతి మోహన్‌కు బాగా తెలుసు. కానీ ఎలా ఎలా?

ఈ సమస్య ఎలా సాల్వ్ చెయ్యాలో, ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అతనికి పాలుపోవడం లేదు. ఏమీ తోచక మోహన్ అభిరామ్ షాపుకు వెళ్ళాడు. ఆ రోజు బిజినెస్ తక్కువగా ఉండటం చేత, ఖాళీగా ఉన్న అభి "ఏరా అలా దిగులుగా ఉన్నావేమని" అడిగాడు. చల్లగాలి తగిలిన మేఘంలా మోహన్ తన మనసులోని బాధ అంతా అతని ముందు వెళ్ళగక్కాడు.

"సుభద్ర అడిగిన దాంట్లో తప్పేమీ కనపడటం లేదు. సాలోచనగా అన్నాడు అభిరామ్ టీ పోసి, ఒక కప్పు మోహన్‌కి ఇచ్చి.

"తప్పేమీ లేదు. నిజమే. అటు చూస్తే పెద్దక్కలిద్దరూ పెళ్ళికి ఎదిగి కూర్చున్నారు. అమ్మా, నాన్నా చూస్తే పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళ రోగాలూ, నీరసాలూ సరేసరి. ఆవన్నీ కాదని, ఇప్పుడిది చదువుతానని కూర్చుంది. ఎలా చదివించాలో నాకు అర్థం కావడం లేదు" తల పట్టుకున్నాడు మోహన్.

టీ తాగుతూ, ఒక అయిదు నిముషాలు దీర్ఘంగా ఆలోచించిన అభిరామ్, సుభద్రని నేను చదివిస్తానురా. తను ఎంత వరకు చదువుకున్నా సరే" అన్నాడు తల ఎత్తుతూ.

"నువ్వా!" ఆశ్చర్యంతో పొలమారింది మోహన్‌కు. "నువ్వు చదివిస్తావా?" తను విన్నది పొరబాటేమోనన్నట్లు దగ్గుతూ అడిగాడు.

"ఎందుకురా అంత ఆశ్చర్యం? మాకెటూ బోలెడు ఆస్తి ఉన్నది. అనుభవించేవాళ్ళా? నేను ఒక్కణ్ణి. ధర్మకార్యాలంటే అమ్మకూ ఇష్టమే. నాకేమో చదువు ఒంటపట్టలేదు. కోరిక ఉన్న, తెలివైన అమ్మాయికి సాయం చేస్తే తప్పేమిటి?"

"కానీ కానీ"

"కానీ లేదు, అర్ధణా లేదు. రేపే అప్లికేషన్ తెచ్చుకోమను సుభద్రని"

"మరి మరి అంత డబ్బు, నేను తిరిగి తీర్చగలనా అని"

"తీర్చమని నేను అడిగానా? పోనీ, ఊరికే తీసుకోవడానికి నీకు అభిమానం అడ్డం వస్తే, వీలయినప్పుడు తిరిగి ఇద్దువుగానిలే"

"చాలా సంతోషంరా. నీ మేలు జన్మలో మరిచిపోను. చదువుకోవాలని కోరిక ఉండీ, వీలుకాకపోతే ఎంత నరకమో నాకు తెలుసు. అందుకే దాన్ని గట్టిగా మందలించలేకపోయాను. నీ ఋణం.."

"ఆ చెప్పు జన్మజన్మలకూ తీర్చుకోలేను, గాడిద గుడ్డూ అని"

"పోరా వెధవా" మనసు ఆపుకోలేక స్నేహితుణ్ణి గట్టిగా కౌగలించుకున్నాడు మోహన్.

❋ ❋ ❋

కెమిస్ట్రీ మెయిన్‌గా చదివిన సుభద్రకు బి.ఎస్సీలో గోల్డ్ మెడలూ, ఎం.ఎస్సీలో యూనివర్శిటీ ఫస్టూ వచ్చాయి. కానీ మంచి ఉద్యోగం ఇంకా రాలేదు. ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా, టెంపరరీగా చేరింది.

తొలిరోజు ఉద్యోగధర్మం నిర్వర్తించి వచ్చిన ఆమెకు గతం గుర్తు వచ్చింది. అసలు చదువుకోగలనా, లేదా అని బాధపడిన తను ఈరోజు చదువు చెప్పే లెక్చరర్ అయింది. తన చిరకాల వాంఛ నెరవేరింది. తన ఆకాంక్ష ఫలప్రదమైంది. ఆమెకు సడన్‌గా ఒక విషయం మైండ్‌లో మెరుపు మెరిసినట్లు అయింది. అదే తన చదువుకు ఆర్థిక సాయం అభిరామ్ అందించిన సంగతి. ఇన్నాళ్ళూ అన్నయ్య స్నేహితుడు, స్నేహధర్మంగా అన్నయ్యకు సాయం చేశాడు అనుకున్నదే గానీ, అది పరోక్షంగా తనకే గదా! మరి ఇంత మేలు చేసిన అతనికి, ఈ ఐదు సంవత్సరాలలో ఒక్కసారైనా కనీసం కృతజ్ఞతలన్నా చెప్పలేదు.

"ఛీ ఇంత తెలివైనదాన్ననుకుంటున్న నాకు ఈ చిన్న విషయం కూడా తట్టలేదేం? "ఈ మొద్దు బుర్రకు ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా లేకపోయిందేం?" ఇక నుండీ నెలనెలా జీతంలో పొదుపు చేసి, అతనికి ఎంతో కొంత జమ చేయాలి"

ఆమె వెంటనే ముఖం కడుక్కుని, మంచి చీర కట్టుకుని అభిరామ్ వాళ్ళ ఇంటికి బయలుదేరింది.

❋ ❋ ❋

"ఏమ్మా చదువు అయిపోయింది. ఉద్యోగం కూడా వచ్చింది. మరి నీకేమైనా పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా మీవాళ్ళు?" అడిగారు మీనాక్షమ్మ కాఫీ తాగుతున్న సుభద్రను. ఆమెను చూస్తుంటే, ఈ అమ్మాయిని ఇక ఎక్కడికీ వెళ్ళనివ్వకూడదు. అభిని ఒప్పించి, నా కోడలిగా నా ఇంట్లోనే ఉంచుకోవాలి" అని బలంగా అనిపిస్తోంది మీనాక్షమ్మ గారికి.

"లేదండీ అయినా అప్పుడే పెళ్ళేమిటీ నాకు?

**(మిగతా 30వ పేజీలో చూడండి)**

## ఉత్తరాలు



### సాహిత్య కళాఖండము

**31.**8.2005 ప్రియదత్త సంచిక సకుటుంబ సమేతంగా చదవదగిన సాహిత్య కళాఖండము. శ్రీకృష్ణాష్టమి పర్వదినం వ్యాసం రమ్య రమణీయ కళానిలయము. గళ్ళనుడికట్టు కొంత సరళంగా ఇస్తే పాఠకులు పాల్గొనే అవకాశముంటుంది. నందిమండల మహానంది వ్యాసం మా ఇంటిల్లిపాదినీ చదివించింది. రావినూతల సువర్నా కన్నన్ ప్రియనేస్తం వాస్తవానికి దగ్గరగా కళ్ళకు కట్టినట్లున్నది. *- గంగరాజు మోహనరావు, తిరునిండ్రవూరు*

## స్పందన సాహితీ సాంస్కృతిక సమాఖ్య కవితల పోటీ

ప్రవాసాంధ్ర సాహితీ సాంస్కృతిక సమాఖ్య స్పందన, రాయగడ (ఒరిస్సా) దశమ వార్షికోత్సవం సందర్భంగా కవితల పోటీ నిర్వహిస్తోంది. ఆసక్తి కలవారు స్వీయ కవితలను, 25 లైన్లకు మించకుండా స్వంత చిరునామా గల పోస్టుకార్డు జతపరిచి, హామీ పత్రంతో పాటు దిగువ చిరు నామాకి అక్టోబరు 5వ తేదీ లోగా అందేటట్టు పంపాలి.

ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పది ఉత్తమ కవితలకు ప్రశంసాపత్రాలు అక్టోబరు మూడవ వారంలో జరుగనున్న దశమ వార్షికోత్సవ సభలో అందజేయబడతాయి. కవి తలు పంపవలసిన చిరునామా : బులుసు రవిశర్మ, కార్యదర్శి, స్పందన, సాయిప్రియ లే అవుట్, హౌసింగ్ బోర్డు ఎదురుగా, రాయగడ - 765 001. ఒరిస్సా.

ఫోన్ : 06856-222414, సెల్ : 094370-95414.

ముందు అక్కలకు చెయ్యాలి గదా?" అన్నది సుభద్ర కాఫీ కప్పు కింద పెడుతూ.

"నువ్వూ అదే మాటా! మావాడూ అంతే. పెళ్ళి అంటే చాలు, ఉలకడు పలకడు. ఎన్ని సంబంధాల గురించి చెప్పినా, ఇంతవరకూ ఒక్క అమ్మాయినైనా చూస్తే ఒట్టు. వాడు షాపుకి వెళ్ళిపోతే, ఇంత కొంపలో బిక్కు బిక్కుమంటూ ఉండాలి. చక్కగా పెళ్ళి చేసుకో. కళకళలాడుతూ కోడలు శ్రీ మహాలక్ష్మిలా ఇంట్లో తిరిగితే చూడాలని ఉంది. పెద్దదాన్ని, నా కోరిక తీర్చరా, ఇంకా ఎంతకాల ముంటానో తెలియదు" అని ఎన్ని విధాలా మొత్తుకున్నా నోరు విప్పడాయె. మనుమల్నీ, మనుమరాళ్ళనీ చూసే యోగం ఈ జన్మకు ఉందో, లేదో?" అన్నారు మీనాక్షమ్మ దీర్ఘంగా నిట్టూరుస్తూ.

ఆమెకు ఏం చెప్పాలో తెలియనట్లు నవ్వి ఊరుకుంది సుభద్ర.

అభిరామ్ కోసం ఎదురు చూస్తూ, ఏమీ తోచక, దిక్కులు చూస్తున్న ఆమెను, "పోనీ ఇక్కడ తోచకపోతే, పైన అభిరామ్ గదిలో ఏమైనా పుస్తకాలు ఉన్నాయేమో చూడు.. తెచ్చి ఇద్దామంటే నేను మెట్లు ఎక్కలేను" అన్నారు మీనాక్షమ్మ.

పైన అభిరామ్ గదిలోకి వచ్చిన సుభద్ర, అక్కడ గోడలకు ఉన్న పెయింటింగ్స్ చూసి ఆశ్చర్య పోయింది. గాంధీ, నెహ్రూ, తల్లీ బిడ్డా, పల్లె పడుచులూ, ప్రకృతి దృశ్యాలూ అన్నీ అత్యంత సుందరంగా, జీవకళ ఉట్టిపడుతూ ఉన్నాయి. అక్కడే ఒక బీరువా తాళం వెయ్యడం మరిచి పోయినట్లు, చిన్న తాళం తగిలించి ఉంది. తలుపు ఓరగా తీసి ఉంది. అసంకల్పితంగా, ఆ బీరువా

## ఒకరికొకరు కథ

(27వ పేజీ తరువాయి)

తలుపు తెరిచిన సుభద్ర మరింత ఆశ్చర్యంతో బొమ్మ అయిపోయింది. ఎందుకంటే, ఎదురుగా తనదే నిలువెత్తు బొమ్మ. మనోహరంగా, తనకంటే మరింత అందంగా.

ఆమె విస్తుబోతూనే, ఆ బీరువాలో కింద పొత్తిగా పెట్టిన మరికొన్ని చిత్రాలు తీసి చూసింది. చిన్నా, పెద్దా సైజుల్లో, రకరకాల భంగిమల్లో అన్నీ తన చిత్రాలే. అచ్చు ముద్రకొట్టినట్లు తనలానే.

అభిరామ్ ఇంతటి ఆర్టిస్టా! తనకెప్పుడూ తెలియలేదే. అన్నయ్య కూడా ఎప్పుడూ అనలేదే? అయినా అసలెప్పుడు తను చంద్రాన్ని పట్టించు కున్నదనీ. తన చదువేమో తానేమో అంతే ఎంతసేపూ, అందర్నీ కష్టపెట్టి చదువుతున్నాను, త్వరగా పూర్తి అయితే ఉద్యోగం వస్తే, అమ్మనూ, నాన్ననూ సుఖపెట్టాలి. అన్నయ్యకు సాయపడాలి. అక్కయ్యలకు పెళ్ళిళ్ళు చెయ్యాలి. అదే ధ్యాస, అదే లోకం."

"అదేమిటి ఈ చిత్రాలన్నింటిలోనూ తాను ఉన్నదేమిటి? ఒక్కదానిలో మాత్రం తాను ఒక అందమైన పడవలో నదీ విహారం చేస్తూ ప్రకృతిని చూస్తుంటే, పడవ నడిపే కుర్రవాడు మాత్రం తననే ఆరాధనగా చూస్తున్నాడు. తనని చూస్తున్న అతని కళ్ళలో వింత మిలమిలలు. అదేమిటీ ఆ కుర్రవాడిలో అభి పోలికలు. అంటే అంటే అభిరామ్ తనను ప్రేమిస్తున్నాడా? ఇంతగా తనను అరాధిస్తున్నాడా?"

"మరి ఆ విషయం నాకు గానీ, అన్నయ్యకు గానీ, కనీసం వాళ్ళ అమ్మగారికి గానీ చెప్పలేదేం? అందుకేనా, ఆమె పెళ్ళి చేసుకొమ్మని పోరుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నాడు? ఆ బీరువాకు తాళం వేసినట్లు అతని మనసుకు కూడా తాళం బిగిస్తే ఏమైనట్లు?"

అభిరామ్ పెద్ద అందగాడు కాదు. అందువల్ల, నేను తనని అంగీకరించనేమోనని, తన అభిమానం మనసులోనే దాచుకున్నాడా?"

"ఒకవేళ అడిగినా, చదువుకి సాయం చేశాడన్న కృతజ్ఞతతో ఒప్పుకుంటుందిగానీ, నన్ను ప్రేమించలేదు అనుకున్నాడా?"

"నాకన్నా చాలా ఎక్కువ చదువుతున్న అమ్మాయి నన్నెలా పెళ్ళి చేసుకుంటుందని అనుమానించాడా?"

"అయినా నా మీద ఇంత అభిమానం పెంచుకుని, ఎంతగానో ఆరాధిస్తున్న అతని హృదయ సౌందర్యం ముందు, నా బాహ్య సౌందర్యం ఏపాటిది?"

"తాను ఐశ్వర్యవంతుడినన్న అహంకారం లేదు. ఇంత సాయం చేశాను.. ఎవరి కోసం ఒప్పుకుంటుంది" అన్న అహంభావం లేదు. మంచితనం, మానవత్వం మూర్తీభవించిన అతని హృదయంలో తాను కొలువై ఉండటం తన నిజమైన అదృష్టం కాదా?"

"నన్ను గాఢంగా ప్రేమించడమూ, దేవతలా ఆరాధించడమే కాదు, ఒకవేళ నేను తిరస్కరిస్తే, ఆ తిరస్కారాన్ని తట్టుకోలేనేమో అన్న భయంతో, తన కొండంత ప్రేమని, గుప్పెడంత గుండెలో పదిలంగా భద్రపరచుకున్నాడన్నమాట ఎవరికీ తెలియనీయక"

"వేదాంతులూ, సిద్ధాంతులూ నేను, నాదీ అన్న అహం ఉండకూడదని ఎంత చెప్పినా, మానవ మాత్రుడికి సృష్టిలో అన్నింటికన్నా ఆనందాన్ని ఇచ్చేది నేనూ, నాదీ అన్న భావమే."

అతని మనసు పూర్తిగా అర్థం చేసుకున్న ఆమెకు, అతనిపై అభిమానం మొలకగా పుట్టి, అతని మంచితనం, మానవత్వాల పరిమళాలు కొమ్మలుగా విస్తరించి, అతనిపై ఆరాధన మహావృక్షంగా మనసు ఊపెయ్యగా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు కూడా మరిచిపోయి ఆలోచిస్తున్న సమయంలో ఆ గదిలోకి అభిరామ్ రావడం కూడా ఆమె గమనించలేదు. ఆ చిత్రాల్లో తానూ ఒక చిత్రమై నిలబడిపోయింది.

అనుకోని అదృష్టంగా, తన ఆరాధ్యదేవత కనుల ముందు ప్రత్యక్షమవడంతో, పలుకరించడం కూడా మరిచిపోయిన అభిరామ్ మరొక చిత్తరువయ్యాడు. మేడ పైకి వచ్చిన మీనాక్షమ్మ వారిద్దరినీ చూసి సంతృప్తిగా నవ్వుకుంది.

## లెవిస్ కేరల్, జె.కె. రౌలింగ్



లెవిస్ కేరల్ పేరు మీరు వినే ఉంటారు. ఇతను ఒక ప్రఖ్యాత పిల్లల నవల ఫాంటసీ రూపంలో రాశాడు. దాని పేరు ఎలైస్ అడ్వంచర్స్ ఇన్ వండర్ లాండ్. ఇది వాడుకలో ఎలైస్ ఇన్ వండర్ లాండ్ అయింది. ఇది 1865లో ప్రచురించబడింది. ఇంతకీ ఇది అతని అసలు పేరు కాదు. ఇతడు ఆంగ్ల గణిత శాస్త్రజ్ఞుడు, రచయిత. రెవరెండ్ ఛార్లెస్ లట్ విడ్జ్ డాడ్జసన్. అతని కలం పేరే లెవిస్ కేరల్.

కథలో ఒక అమ్మాయి ఉంటుంది. పేరు ఎలైస్ (ఏలీస్) ఆ అమ్మాయి ఒక గోతిలోకి పడిపోతుంది. ఇక ఆ కింద కనబడేది అంతా కల్పన, మహాకల్పన. అక్కడ జంతువులన్నీ మనలా మాటాడేస్తాయి. మనలా ప్రవర్తిస్తాయి. ఆ కల్పనలో పేకముక్కలు సయితం మానవులలాగా ప్రవర్తించడం, మాట్లాడడం సాగిపోతుంది. కథలో డాడ్జసన్ తన స్నేహితులకు సంబంధించిన సన్నివేశాలు పొందుపరిచాడు. ఆంగ్ల స్కూళ్ళల్లో పిల్లలు వల్లె వేయడానికి ఇచ్చే పద్యాలు, ప్రస్తావనలు ఉంటాయి.

మొత్తానికి ఈ గ్రంథం పిల్లల మనసులో చెరగని ముద్ర వేసింది. 140 సంవత్సరాలనాటి ఈ గ్రంథాన్ని హేరీ పోటర్ హీరోగా వచ్చిన గ్రంథాలతో పోల్చుకోవాలి. ఆనాటి కాలమాన పరిస్థితులు, ఈనాటి కాలమాన పరిస్థితులకు భిన్నం. ఆనాటి ఏలీస్, అనేక నవలలు కథలు కార్టూన్లు, టివి షోలు సినిమాలకి మార్గదర్శమయింది. ఆధునిక సాంకేతిక విజ్ఞానం అన్నివిధాలా జె.కె.రౌలింగ్‌కు ఆమె రచనలద్వారా ఎనలేని కీర్తి, ధనం సంపాదించి పెట్టింది.

- జమ్మి కోనేటిరావు